


రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:34 (శనివారం సాయంత్రం)
సహర్: 4:50 (ఆదివారం ఉదయం)

శ్రీశైలం జలాశయంలో మిగిలింది 44 టీఎంసీలే



శ్రీశైలం జలాశయం బ్యాక్ వాటర్

- ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో కొనసాగుతున్న విద్యుత్ ఉత్పాదన
- సాగు, తాగునీటి అవసరాలకు సాగర్‌కు నీటి విడుదల
- 805 అడుగుల వరకు నీటిని వాడుకునేందుకు ప్రభుత్వ నిర్ణయం

6

నిరంతరాయంగా సహాయక చర్యలు

- ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి
- రిస్క్యూ బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష
- ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం జరిగి 35 రోజులు

7



వెలికితీసి బయటకు తెచ్చిన లోకో ట్రైన్

రంజాన్ చివరి శుక్రవారం ప్రార్థనలు


ఇంటిలోనే ఉపవాసాలు ఉంటూ.. మహిళలు సైతం ప్రార్థనలు చేస్తూ వస్తున్నారు. ముస్లింలు చిన్నా, పెద్దా అన్న తేడా లేకుండా అందరూ ప్రార్థనలు చేస్తారు. అందులో రంజాన్ మాసం చివరి శుక్రవారం కావడంతో మక్కా మసీద్‌లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాగా, సాయంత్రం ఇఫ్తార్ సమయంలో మసీదుల్లో పండ్లతో అల్పాహారం ఏర్పాటు చేశారు. ఉపవాసం ముగిశాక అల్పాహారం తీసుకున్నారు. జిల్లా కేంద్రంలో పలు చోట్ల హరీస్, హలీమ్, కేంద్రాల వద్ద సందడి నెలకొన్నది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి



వనపర్తి మక్కా మసీద్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

జీపీ లేఅవుట్లు ఊడ్చేశారు!



- 2020 ఆగస్టు నుంచి వాటిపై నిషేధం విధించిన ప్రభుత్వం
- 2022-23లో నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేసిన అధికారులు

- 2020 ఆగస్టు నుంచి వాటిపై నిషేధం విధించిన ప్రభుత్వం
- 2022-23లో నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేసిన అధికారులు
- కోర్టు ఆదేశాల మాటున కొన్ని.. లొసుగులను అడ్డుపెట్టుకొని మరికొన్ని..
- అందుకు రెండింతల కమీషన్ అందజేత
- కొందరు అధికారులు రూ.కోట్లు కొల్లగొట్టారన్న ఆరోపణలు





జడ్చర్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని జీపీ లేఅవుట్

మహబూబ్‌నగర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) గ్రామ పంచాయతీ లేఅవుట్‌ల మాటున రిజిస్ట్రేషన్ అధికారులు రూ.కోట్లు కొల్లగొట్టారు. నిషేధం ఉన్న సమయంలో లొసుగులను అడ్డుపెట్టుకుని నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్‌లు చేసి, కమీషన్ రెండింతలు వసూలు చేశారు. 2020 నుంచి జీపీ లేఅవుట్లపై ప్రభుత్వం నిషేధం విధించింది. 2022-23 సంవత్సరాల్లో దాదాపుగా జీపీ లేఅవుట్లను రిజిస్ట్రేషన్ చేయడంతో ప్రస్తుతం ప్రభుత్వం వీటిపై నిషేధం ఎత్తివేసినా పెద్దగా రిజిస్ట్రేషన్‌లు చేసుకోవడానికి ముందుకురావడం లేదు. 2020 ఆగస్టు నుంచి ప్రభుత్వం జీపీ లేఅవుట్ల రిజిస్ట్రేషన్‌లను నిలిపేసింది. అయితే సిస్టమ్‌లో మాడ్యూల్ తొలగించ లేదు. దీన్ని ఆసరాగా చేసుకుని, అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులు జీపీ లేఅవుట్ల రిజిస్ట్రేషన్‌లకు తెర లేపారు. రెండు నుంచి మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న వాటిన్నింటిని దాదాపుగా పూర్తి చేశారు. నిబంధనలు అతిక్రమించి చేయడంతో పలువురు అధికారులు రూ.లక్షల నుంచి రూ.కోట్లు దండుకున్నారన్న ఆరోపణలున్నాయి.

ప్రభుత్వ లెక్క తప్పుతోంది

ఐదేళ్లుగా జీపీ లేవుట్ల రిజిస్ట్రేషన్‌లను ప్రభుత్వం నిలిపేసింది. ఆ సమయంలో రిజిస్ట్రేషన్‌లకు అనుమతించాలని రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వం అనుమతిస్తే అన్ని రిజిస్ట్రేషన్‌లు చేసుకుంటామని, తద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని వినతులు ఇవ్వడంతో పాటు ఆందోళనలకు దిగారు. తీరా ప్రభుత్వం అనుమతిచ్చే

(మిగతా 6లో..)

రూ.10 లక్షలు లంచం తీసుకొని..

2023లో కల్వకుర్తి శివారు పరిధిలోని ఓ జీపీ లేఅవుట్‌లో ఒకే రోజు 150 ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో బలవంతంగా కల్వకుర్తి అధికారుల చేత రిజిస్ట్రేషన్ చేయించారు. అందుకు సదరు ఉన్నతాధికారి రూ.10 లక్షలు తీసుకోగా, ఈ వ్యవహారంలో కల్వకుర్తి అధికారి సస్పెండ్ అయ్యాడు. సస్పెండ్ అయిన తరువాత సదరు ఉన్నతాధికారి తీసుకున్న రూ.10 లక్షలలో రూ.8 లక్షలు వసూలు చేశారు. ఆ డబ్బులు కూడా ఉన్నతాధికారికి సహకరించిన మరో అధికారి ఒప్పుకుని ఇవ్వడం గమనార్హం. సస్పెండ్ అయిన నెల రోజుల్లోనే ఆ అధికారికి మళ్లీ అదేస్థానం ఇచ్చి ఓ భారీ వెంచర్‌ను అతనిచే నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేయించి, మరోమారు సస్పెండ్ కావడానికి కారణమయ్యారు.



ఒకే రోజు 300 లేఅవుట్లు రిజిస్ట్రేషన్

అదే సమయంలో వనపర్తి సబ్ రిజిస్ట్రేషన్ పరిధిలో 7 వేల జీపీ లేఅవుట్లు రిజిస్ట్రేషన్ చేసి సస్పెండ్ అయిన అధికారి నెల రోజులకే మళ్లీ పోస్టింగ్ తెచ్చుకున్నారు. జడ్చర్ల పరిధిలో 5 వేల ప్లాట్లకు అనధికారికంగా రిజిస్ట్రేషన్‌లు చేశారు. నాగర్‌కర్నూల్ పరిధిలో ఒకే రోజు 300 జీపీ లేఅవుట్‌లకు రిజిస్ట్రేషన్‌లు చేశారు. మహబూబ్‌నగర్ శివారు పరిధిలోని జీపీ లేఅవుట్‌లు దాదాపు అన్ని ఖతం చేశారు.

పేదింటి మహిళలకు అండగా
కల్యాణలక్ష్మి, షాదీముబారక్

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అన్నివర్గాల ప్రజలకు అండగా నిలిచిన నాయకుడు సీఎం రేవంత్‌రెడ్డి అని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల నియోజక వర్గంలోని అన్ని మండలాలతో పాటు గద్వాల పట్టణానికి సంబంధించిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన . 40 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బులను వృధా చేసుకోకుండా అవసరానికి వినియోగించుకోవాలన్నారు. మాజీ ప్రజాప్రతినిధులు, జిల్లా సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అధికారులు ఉన్నారు.



చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

ఫ్రైడే

ఉష్ణోగ్రతలు ఇలా..

జిల్లా పేరు	గరిష్ఠం
మహబూబ్‌నగర్	39.9
నాగర్‌కర్నూల్	38.0
జోగులాంబ గద్వాల	40.9
వనపర్తి	40.3
నారాయణపేట	38.0



ఎండవేడిమి తట్టుకోలేక..

- భానుడి భగభగతో రోడ్లు నిర్మానుష్యం
- మండుతున్న ఎండలు
- 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత
- బయటికి రావాలంటే జంకుతున్న ప్రజలు

వనపర్తి అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): భానుడి ప్రతాపంతో ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్నాయి. ఎండ తీవ్రతకు తోడు వడగాల్పులు వీస్తుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో గత మూడు రోజులుగా ఉష్ణోగ్రత 40 డిగ్రీల చేరువలోకి చేరింది. ఎండ వేడిమికి తోడు వడగాల్పులతో ప్రజలు ఇళ్లల్లో నుంచి బయటికి రావడానికి భయపడుతున్నారు. మార్చి చివరి వారంలోనే ఉదయం 10గంటల నుంచి సూర్యుడి ప్రతాపంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. శుక్రవారం జిల్లాలో 4 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. చిన్నంబావి, గోపాల్‌పేట, పెబ్బేరు మండలాల్లో 40.3, ఆత్మకూరు 40.2, పాన్‌గల్‌లో 40.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. మరో వారం రోజుల్లో యాసంగి పంటలు కోతకు రానుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల నిర్మాణ కార్మికులు, హమాలీలు ఎండ వేడిమికి తట్టుకోలేకపోతున్నారు. ఉపశమనం పొందేందుకు శీతల పానీయాలను తీసుకుంటున్నారు.





ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన వనపర్తి జిల్లా కేంద్రంలోని రోడ్డు



శీతలపానీయం తీసుకుంటున్న ప్రజలు



ఎండలోనే.. తప్పని విధులు..



జగ్గుతో నీటిని తాగుతూ..

ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

- మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి



బస్సును ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు , విద్యార్థులకు రవాణా సౌకర్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక సాంస్కృతిక పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. కొల్లాపూర్ ఆర్టీసీ బస్ డిపోకు మంజూరైన పది కొత్త బస్సులను ప్రారంభించేందుకు హాజరైన మంత్రికి ఆర్ఎంపీ సంతోష్, డిపో మేనేజర్ ఉమాశంకర్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. శుక్రవారం మంత్రి పది ఆర్టీసీ బస్సులను ప్రారంభించారు. కొల్లాపూర్ నుంచి వయా కల్వకుర్తి మీదుగా యాదగిరి గుట్టకు బయలుదేరుతున్న బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు విద్యార్థులకు రవాణా సౌకర్యంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తాను తీసుకువెళ్లగా, వెంటనే స్పందించారన్నారు. ఆర్డీవో భన్సీలాల్, డిపో మేనేజర్ ఉమాశంకర్, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, డిపో సూపర్‌వైజర్లు, సిబ్బంది, కండక్టర్లు, డ్రైవర్లు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



డీసీసీ ప్రక్షాళన



(ఎడమ నుంచి వరుసగా..) కేవీఎన్ రెడ్డి, కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రతాప్‌గౌడ్, మహమ్మద్ హబీబ్, రాములుయాదవ్

- కొత్త అధ్యక్షుడి విషయంలో ఐదు పేర్ల పరిశీలన
- ఏఐసీసీకి పీసీసీ నుంచి నివేదిక - ఉగాది తర్వాత కొత్త కమిటీ

నాగర్‌కర్నూల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : క్షేత్రస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ దృష్టి సారించారు. దక్షిణాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ పట్టు నిలబెట్టేందుకు ఇటీవల భారీ ఎత్తున కసరత్తు జరుగుతున్న విషయం తెలిసిందే.

15 రోజుల నుంచి 13 రాష్ట్రాలకు సంబంధించిన డీసీసీ అధ్యక్షులు, ముఖ్యులతో కాంగ్రెస్ అధిష్ఠానం ప్రత్యేక సమావేశాన్ని జరుపుతున్న నేపథ్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ కమిటీని ప్రక్షాళన చేసే దిశగా కూడా ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించినట్లు విశ్వసనీయమైన సమాచారం.

● పరిశీలనలో ఆ ఐదుగురి పేర్లు

జిల్లా కాంగ్రెస్ కమిటీలను పునర్వ్యవస్థీకరించాలని నిర్ణయించిన కాంగ్రెస్ అధిష్ఠానం ఈ సారి కొత్త వ్యూహాన్ని అమలు చేస్తోంది. గతంలో మాదిరిగా ఎమ్మెల్యేలు మంత్రుల తాబేదారులకు పదవులు కట్టబెట్టకుండా పార్టీ కోసం పందిరి గుంజల్లా పని చేసిన నాయకులు, కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని గట్టి నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఐదు పేర్లు పరిశీలనకు వెళ్లాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కేవీఎన్.రెడ్డి, కల్వకుర్తి మండలం తాండ్రకు చెందిన కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, కొల్లాపూర్ నియోజకవర్గంలో పెద్దకొత్తపల్లి మాజీ ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, కొల్లాపూర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రాములుయాదవ్, నాగర్‌కర్నూల్ జిల్లా మైనార్టీ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ హబీబ్‌ల పేర్లు అధిష్ఠానం దృష్టికి వెళ్లాయి. ఎన్ఎస్‌యూఐ యువజన కాంగ్రెస్‌లో ఉమ్మడి జిల్లా బాధ్యతలు నిర్వహించిన కేవీఎన్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించడానికి సుముఖంగా లేరు. పెద్దకొత్తపల్లి మాజీ ఎంపీపీ ప్రతాప్‌గౌడ్ రేసులో రెండవ స్థానంలో ఉన్నప్పటికీ ఆయన అనుచరులు మాత్రం డీసీసీ అధ్యక్ష పదవిని తీసుకోవడానికి ససేమిరా అంటున్నారు. జిల్లా పరిషత్‌కు సంబంధించి బీసీలకు అనుకూలంగా రిజర్వేషన్ వస్తే ఆ అవకాశాన్ని దక్కించుకోవాలనే ఆలోచనలో ప్రతాప్‌గౌడ్ అనుచరులు ఉన్నారు. సామాజిక కోణంలో కొల్లాపూర్‌కు చెందిన రాములుయాదవ్ పేరు అధిష్ఠానం దృష్టికి వెళ్లినా ఆయన పెద్దగా పట్టించుకునే యోచనలో లేరు. నాగర్‌కర్నూల్ జిల్లా మైనార్టీ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ హబీబ్ కూడా రంగంలో ఉన్నప్పటికీ.. మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్ష పదవి ఒబెదుల్లా కొత్వాల్ తర్వాత మళ్లీ మరో మైనార్టీకేటాయిస్తే హబీబ్‌కు మరోచోట అవకాశం కల్పించేందుకు అధిష్ఠానం ప్రయత్నాలు చేస్తున్నది. కల్వకుర్తి మండలం తాండ్రకు చెందిన విజయ్‌కుమార్‌రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియామకమయ్యే అవకాశాలు అధికంగా ఉన్నాయని చెబుతున్నప్పటికీ చివరి వరకు ఏం జరుగుతుందో వేచి చూడాల్సి ఉంది.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు.
మహబూబ్‌నగర్ : 9985411175, 9985403259
నాగర్‌కర్నూల్ : 9985410905
వనపర్తి : 9985403242
గద్వాల : 9985403238
నారాయణపేట : 9985411463
మరిన్ని వివరాలకు సంప్రదించండి
9985411365

బహిరంగ ప్రకటన

ICICI Bank

నమోదిత కార్యాలయం: ICICI బ్యాంక్ టవర్, చక్లీ సర్కిల్ సమీపాన, ఓల్డ్ పద్రా రోడ్, వడోదర - 390007
కార్పొరేట్ కార్యాలయం: ICICI బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, ముంబాయి - 400051

బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన

బంగారు ఆభరణాల సౌకర్యం నిమిత్తం ICICI బ్యాంక్ లిమిటెడ్ ("ICICI బ్యాంక్") నుండి పొందిన (సౌకర్యం) తమ బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా దిగువ తెలిపిన రుణగ్రహీతలకు నోటీసు జారీచేయడమైనది. వారు బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాలను ఏప్రిల్ 08, 2025న ఇ-వేలం వేయడానికి మాకు తప్పనిసరి అయ్యింది. ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే ఖాతాను తొలగించడానికి/ ఇ-వేలం తేదీని మార్పు చేయడానికి ICICI బ్యాంక్‌కు అధికారం ఉంది. వేలం - https://gold.samil.in ఆన్‌లైన్‌లో మ.12:30 గం. నుండి మ.3:30 గం. మధ్య నిర్వహించబడుతుంది. ఇవ్వబడిన వెబ్‌సైట్‌కు లాగిన్ అవండి. మరణించిన రుణగ్రహీత విషయంలో, వారి న్యాయవారసులకు అన్ని నియమ నిబంధనలు వర్తిస్తాయి.

రుణ ఖాతా నెం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: ఆర్మూర్	
069562011400	మంగలపు రాజు
069562012506	[illegible]
శాఖ పేరు: గద్వాల్	
092062015811	పెద్ద [illegible]
శాఖ పేరు: గజ్వేల్	
774162001159	[illegible]
శాఖ పేరు: హైదరాబాద్ - Cbit గండిపేట	
438562000215	మొహమ్మద్ ముర్తుజా అహ్మద్
శాఖ పేరు: హైదరాబాద్ - Dsr, ఇన్‌ఆర్బిట్ రోడ్	
468762000046	బలరామచంద్రుడు [illegible]
శాఖ పేరు: హైదరాబాద్ - Kphb కాలనీ	
434762000597	[illegible]
శాఖ పేరు: హైదరాబాద్ - ఈస్ట్ మారేడుపల్లి	
111862001668	[illegible]
111862001669	[illegible]
శాఖ పేరు: హైదరాబాద్ - హబ్సిగూడ	
006962016488	[illegible]
శాఖ పేరు: హైదరాబాద్ - మియాపూర్	
111262003239	[illegible]
శాఖ పేరు: జగిత్యాల	
280862009386	మొహమ్మద్ [illegible]
శాఖ పేరు: మోహన్‌రావుపేట్	
220862002008	[illegible] గంగారాం
శాఖ పేరు: నల్గొండ	
380062003393	దాసరి వెంకన్న అలియాస్ దేవదత్తం
380062006859	[illegible]
శాఖ పేరు: సంగారెడ్డి	
286562002011	[illegible] ప్రశాంత్
శాఖ పేరు: సూర్యాపేట	
280762009048	[illegible]
280762009051	[illegible]
శాఖ పేరు: ఉప్పల్ కలాన్	
132062003219	[illegible]
శాఖ పేరు: వెల్గుల్	
221362001644	[illegible] రాజశేఖర్
శాఖ పేరు: వికారాబాద్	
395862003005	[illegible] రాజు

తేది : 29.03.2025
ప్రదేశం : మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, వికారాబాద్, నల్గొండ, సూర్యాపేట్, సంగారెడ్డి, హైదరాబాద్, జగిత్యాల, సిద్దిపేట, నిజామాబాద్, జోగులాంబ (గద్వాల్)

సం/- అధీకృత అధికారి
ICICI బ్యాంక్ లిమిటెడ్ తరపున

ఇద్దరికి ఆర్మీలో ఉద్యోగాలు



అన్నదమ్ములు సందీప్ కుమార్, డీబీ కుమార్ నాయుడు

మల్దకల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటికుంట గ్రామానికి చెందిన ఇద్దరికి ఆర్మీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. తాటికుంట గ్రామానికి చెందిన బోయ దుబ్బోనిబాయి బుడ్డన్నకు మారుడు డీబీ సందీప్‌కుమార్, బోయ దుబ్బోనిబాయి ఆంజనేయులు కుమారుడు డీబీ కుమార్ నాయుడు ఆర్మీలో సోల్జర్ ఉద్యోగాలకు ఎంపికవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం గ్రామంలోని వారి నివాసంలో ఇద్దరినీ గ్రామస్థులు సన్మానించి అభినందించారు. దుబ్బోనిబాయి ఆంజనేయులు సివిల్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు.

జములమ్మ హుండీ లెక్కింపు

» గత ఏడాది కంటే తగ్గిన ఆదాయం



హుండీలోని నగదును లెక్కిస్తున్న శ్రీ వెంకటేశ్వర సేవా సమితి సభ్యులు, భక్తులు

గద్వాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలో భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న జములమ్మ దేవాలయం హుండీని శుక్రవారం లెక్కించారు. ఆలయ చైర్మన్ వెంకట్రాములు, ఎండోమెంటు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ, ఈవో పురేందర్‌కుమార్ ఆధ్వర్యంలో జములమ్మ, పరశురాముడి ఆలయాల్లోని హుండీలని లెక్కించారు. దాదాపు 65 రోజుల హుండీని లెక్కించగా రూ. 27.78 లక్షల ఆదాయం వచ్చిందని ఈవో తెలిపారు. గత ఏడాది 45 రోజుల హుండీని లెక్కించగా రూ.27.28 లక్షలు వచ్చిందని వివరించారు. గత ఏడాది కంటే రూ.50వేలు అధిక ఆదాయం సమకూరింది. అలాగే మిశ్రమ వెండి 2.70 కిలోలు, మిశ్రమ బంగారం 64 గ్రాములు వచ్చిందని ఆలయ అధికారులు తెలిపారు. హుండీ లెక్కింపులో శ్రీ వెంకటేశ్వర సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు. వారికి ఆలయ చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టరు మల్లేశ్, వీరేశ్, ముసిలన్న, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్



జడ్చర్లలో మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌కు పండ్లు తినిపిస్తున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మతసామరస్యానికి రంజాన్ పండుగ ప్రతీక అని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్ర ప్రభుత్వం పక్షాన ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఉపవాసం విరమించిన ముస్లింలకు ఎమ్మెల్యే, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్ల కొత్వాల్ పండ్లు తినిపించారు. అంతకుముందు వారు మాట్లాడుతూ స్థానిక మునిసిపాలిటీ, కావేరమ్మపేట సమీపంలో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించడం జరిగిందని, ఆ స్థలాన్ని ఈద్గా కోసం కేటాయించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ముస్లింలతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నర్సింగ్‌రావు, బాదిమి శివకుమార్, అశోక్‌యాదవ్, నిత్యానందం, మినాజ్, రబ్బాని, రహిమొద్దీన్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఏబీసీ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

జడ్చర్ల మునిసిపాలిటీలో కొత్తగా ఏర్పాటు చేసిన ఏబీసీ (యానిమల్ బర్త్ సెంటర్)ను శుక్రవారం ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ప్రారంభించారు. కావేరమ్మపేటలోని చీకూరిగుడిసెల సమీపంలో ఆర్థికసంఘం నిధులు రూ.34లక్షలతో నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, వైస్‌చైర్‌పర్సన్ పాలాదిసారిక, కమిషనర్ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, సతీశ్, జ్యోతి, రమేశ్, కుమ్మరి రాజు పాల్గొన్నారు.

పేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం పనుల పరిశీలన



మక్తల్ మండలంలోని కాట్రేవ్‌పల్లి వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ బృందం

నారాయణపేట/మక్తల్ రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం సర్వే పనులు పూర్తి కావడంతో శుక్రవారం హైదరాబాద్ క్వాలిటీ కంట్రోల్ అధికారుల బృందం చీఫ్ ఇంజనీర్ వెంకటకృష్ణ, డీఈ రమణారెడ్డి నారాయణపేట మండలం పేరపళ్ల జాయమ్మ చెరువు వద్ద నిర్మించబోయే పంప్‌హౌస్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మట్టి పరీక్షలు నిర్వహించారు. నిర్మాణాలకు ఏమేరకు అనుకూలంగా ఉన్నాయనే అంశంపై పరిశీలించి నివేదికలు సిద్ధం చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో క్వాలిటీ కంట్రోల్ అధికారుల బృందం పరిశీలించి, అన్ని వివరాలు సేకరించారు. జిల్లాలోని కాట్రేవుపల్లి, బాపూర్, పేరపళ్ల గ్రామాల వద్ద పంపుహౌస్, కాలువలు, చెరువులు, స్థలాలను పరిశీలించారు. కాట్రేవ్‌పల్లి వద్ద పూర్తి వివరాలను వారు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ రమణారెడ్డి, ఎస్ఈ శ్రీధర్, డీఈ శ్రీనివాస్ ఈఈ బ్రహ్మానందం, ఏఈఈ నాగశివ తదితరులున్నారు.

కలెక్టర్ ఆదేశాలతో కదలిక

» అధికారులతో జరిపిన సమీక్షతో కదిలిన యంత్రాంగం
» జిల్లాలో ఉపాధి హామీ కూలి రెట్టింపు
» పని ప్రదేశాల్లో నీరు, నీడ, ప్రథమ చికిత్స సౌకర్యాలు కల్పించాలి
» జిల్లాలో 49,278 కుటుంబాలకు ఉపాధి పనులు



పేట వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమీక్షిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్ (ఫైల్)

నారాయణపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య తగ్గడం, దినసరి కూలి తక్కువగా ఉండడంతో పాటు వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాల సంఖ్య తగ్గడంతో గాడి తప్పిన ఉపాధి హామీ పథకం అధికారులపై కలెక్టర్ సిక్తా పట్నాయక్ సీరియస్ అయ్యారు. దాంతో జిల్లాలో జాతీయ గ్రామీణ అభివృద్ధి ఉపాధి హామీ పథకం యంత్రాంగంలో కదలికలు వచ్చాయి.

సమీక్షలో కలెక్టర్ సీరియస్

జిల్లాలోని ఊట్కూర్, నారాయణపేట, దామరగిద్ద, మద్దూర్, కోస్గి మండలాల్లో ఉపాధి హామీ పథకం పనులపై ఈనెల 24న సమీక్షించిన కలెక్టర్ జిల్లాలో గ్రామాల వారీగా ఉపాధి కూలీల హాజరు తగ్గుదల, వేతన రేటు వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలు తక్కువగా ఉండడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో పనితీరు మెరుగుపర్చుకోవాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాంతో ఉపాధి హామీ అధికారుల్లో హడావిడి మొదలైంది.

జిల్లాలో రోజువారీ కూలీలు రెట్టింపు

జిల్లా వ్యాప్తంగా 208 గ్రామ పంచాయతీల్లో రోజువారీ ఉపాధి కూలీలు 8400 నుంచి పదివేల మంది వరకు మాత్రమే పనులకు హాజరవుతూ వచ్చారు. కూలీల తగ్గుదలపై కలెక్టర్ తప్పుపట్టి సమీక్షలో క్లాస్ తీసుకున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా కూలీల సంఖ్య 16,368కి తాజాగా రెట్టింపు స్థాయిలో పెరిగింది. దాంతో గ్రామానికి 58.54 శాతం కూలీలు వస్తున్నారు. ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం అవుతుండడంతో గత ఆర్థిక సంవత్సరం మార్చి నెలాఖరుతో పూర్తి అవుతుంది.



కోస్గి మండలం నాచారంలో కొనసాగుతున్న ఉపాధి పనుల్లో కూలీలు

వంద రోజుల పని పూర్తి చేసుకున్న కుటుంబాలు 754

జిల్లాలో ఇప్పటివరకు వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలు 754 ఉన్నాయి. జిల్లాలో పని కల్పించిన కుటుంబాల సంఖ్య 49,278 ఉండగా ఈనెల 25 వరకు 2,03,330 మందికి పని దినాలు కల్పించారు. జిల్లా వ్యాప్తంగా 1,10,817 ఉపాధి హామీ జాబ్‌కార్డులు ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 21,33,000 పని కల్పించాల్సి ఉండగా ఈనెల 25 వరకు 20,33,000 మందికి పని కల్పించారు. నెలాఖరులోపు లక్ష మందికి పని కల్పించే అవకాశం ఉండడంతో లక్ష్యం అధిగమించే అవకాశం ఉంది.

150 మంది వరకు రావాల్సిందే

ఇదివరకు గ్రామానికి రోజూ 32 నుంచి 35 మంది వరకు పనుల్లో పాల్గొనగా కలెక్టర్ క్లాస్ అనంతరం తాజాగా గ్రామానికి 59 మంది వరకు వస్తున్నారు. ఏప్రిల్ 1 కొత్త ఆర్థిక సంవత్సరంలో 100 నుంచి 150 మంది వరకు కూలీలు వచ్చేలా చర్యలు తీసుకోవాల్సిందేనని హుకుం జారీ చేశారు.

రూ.26 లక్షల బడ్జెట్‌తో పనిదినాల కల్పనే లక్ష్యం

కొత్త ఏడాదిలో రూ.26 లక్షల బడ్జెట్‌తో పని దినాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వానికి జిల్లా యంత్రాంగం ప్రతిపాదనలు పంపించింది. ఎండల దృష్ట్యా పని ప్రదేశాల్లో కూలీలకు షెడ్‌నెట్‌తో నీడను కల్పించడంతో పాటు తాగునీటి వసతి కల్పించేలా గ్రామ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలి. ప్రథమ చికిత్స అందించేందుకు అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచుకోవాలన్నారు.

ప్రభుత్వం రూ.300 ఇస్తున్నా.. జిల్లాలో అందుతున్న రోజు కూలి రూ.205

జిల్లాలో ప్రస్తుతం కూలి మాత్రం రూ.205 ఉపాధి కూలీలకు అందుతుండంతో గిట్టుబాటు కాని కూలితో ఆందోళన చెందుతున్నారు.. కనీసం రూ. 250 తగ్గకుండా చూడాలని.. ఏప్రిల్ నుంచి ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు కూలీలకు కొలతలు ఇచ్చి అందుకనుగుణంగా ఉదయం 7 నుంచి 11:30 గంటల వరకు పనులు జరిగేలా క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తే కూలి కూడా పెరుగుతుందని.. దీనిపై ఫోకస్ పెట్టేలా చూడాలని కలెక్టర్ సూచించారు. 266 రకాల పనుల్లో తాజాగా చెరువు పూడికతీత పనులు తాత్కాలికంగా తొలగించి మిగతా పనులు చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతించింది. భూగర్భ జలాలు పెరిగేలా కందకాలు తవ్వకాలు, పారంపండ్స్ తదితర పనులు చేపట్టేలా చూసుకోవాలన్నారు.

వారంవారం వేతన చెల్లింపులు వందశాతం జరగాలి..

వారంవారం వేతనాల చెల్లింపుల్లో జిల్లాలో 97.08 శాతం ఉందని, కొత్త ఆర్థిక సంవత్సరంలో వందశాతం వేతన చెల్లింపులు జరిగేలా సాఫ్ట్‌వేర్‌ను అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లాలో ఈనెల 25న మాగనూర్ మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు గాను 16 పనులు కొనసాగుతుండగా 1790 మంది కూలీలకు గాను 1285 మంది కూలీలు ఉపాధి పనుల్లో పాల్గొని 111.88 శాతంతో జిల్లాలోనే ఆధిక్యంలో ఉంది. ధన్వాడ మండలంలో 20 పంచాయతీలకు 20 పనులు కొనసాగుతుండగా 2045 మందికి గాను 1721 మంది పనుల్లో పాల్గొని 102.25 శాతంతో ఆధిక్యంలో ఉన్నారు. అత్యల్పంగా మద్దూర్ మండలంలో 49 గ్రామ పంచాయతీలకు గాను 49 పనులు కొనసాగుతుండగా 1877 మందికి గాను 1231 మంది కూలీలు పనిచేసి 38.31 శాతంలో ఉన్నారు. ఏప్రిల్ నెల నుంచి ప్రారంభమయ్యే కొత్త ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పనులు మరింత వేగవంతం చేసి కూలీల హాజరు శాతం పెంచేలా ఉపాధి సిబ్బంది ఏ మేరకు చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

జీపీ లేఅవుట్లు ఊడ్చేశారు

(5వ పేజీ తరువాయి)

సమయానికి వారి నుంచి స్పందన కరువవుతోంది. 2020 ఆగస్టు తరువాత ప్రభుత్వం రెండుసార్లు భూముల మార్కెట్ విలువ పెంచింది. దరఖాస్తు చేసుకున్న సమయంలో ఉన్న మార్కెట్ విలువనే పరిగణలోకి తీసుకుని, దానిపై 25 శాతం రాయితీ ఈనెల 31 వరకు గడువు ఇచ్చారు. ఇది నిజంగా ఎల్ఆర్ఎస్, రిజిస్ట్రేషన్ చేసుకునేవారికి ఎంతో ప్రయోజనం చేకూరుస్తుంది. ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులతోపాటు గతంలో చేసిన లేఅవుట్‌లో 10 శాతం రిజిస్ట్రేషన్ చేసుకుని, మిగిలిపోయిన 90 శాతం ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లకు కూడా అవకాశం ఇచ్చింది. దాంతో మునిసిపల్, రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు రిజిస్ట్రేషన్ల కోసం క్యూ కడతారని ప్రభుత్వం భావించింది. అయితే వారినుంచి స్పందన లేకపోవడంతో అవగాహన సదస్సులు నిర్వహించడం, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం, ఆటోలలో ప్రచారం చేయడం చేస్తున్నారు. అయినా ఆశించినమేర దరఖాస్తుదారులు ముందుకురావడం లేదు. దీన్నిబట్టి దరఖాస్తు చేసుకున్న లేఅవుట్‌లలో, ముఖ్యంగా జీపీ లేఅవుట్‌లను ఈపాటికే రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేశారని స్పష్టం అవుతోంది. ప్రభుత్వం ఐదేళ్ల క్రితం వీటిపై నిషేధం విధించినా, రిజిస్ట్రేషన్ శాఖలో ఆప్షన్‌ను తొలగించలేదు. లొసుగులను అడ్డు పెట్టుకుని అనధికారికంగా రిజిస్ట్రేషన్‌లు చేశారు. ఉమ్మడి పాలమూరులో 12 రిజిస్ట్రేషన్ శాఖలలో ఇదే వ్యవహారం సాగిందని తెలుస్తోంది. ప్రభుత్వం మాత్రం ఐదేళ్లుగా నిషేధం ఉందని, అప్పుడు దరఖాస్తు చేసుకున్న వారంతా ఇప్పుడు అధిక సంఖ్యలో ముందుకు వచ్చి ఎల్ఆర్ఎస్, రిజిస్ట్రేషన్‌లు చేసుకుంటే భారీగా ఆదాయం వస్తుందని అనుకుంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం గతంలోనే మూడొంతుల రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయన్న విషయం తెలుస్తోంది. ఎల్ఆర్ఎస్ ద్వారా రూ.వందల కోట్ల ఆదాయం వస్తుందని ఆశించినా లెక్క తప్పుతోంది.

2020 నుంచి విచారణ చేయాలి

జీపీ లేఅవుట్ల రిజిస్ట్రేషన్‌ను 2020 నుంచి ప్రభుత్వం నిలిపేసింది. ఈ ఐదేళ్ల కాలంలో ఎన్ని జీపీ లేఅవుట్లకు రిజిస్ట్రేషన్‌లు జరిగాయో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల వారీగా విచారణ జరిపితే అధికారుల బాగోతాలన్నీ బయటపడనున్నాయి. కొన్నింటికి కోర్టులు ఇచ్చిన ఉత్తర్వులను అడ్డం పెట్టుకుని రిజిస్ట్రేషన్‌లు చేయగా, మరికొన్నింటిని మాత్రం అడ్డగోలుగా చేశారు. అందుకే ప్రభుత్వం ప్రస్తుతం ఎల్ఆర్ఎస్, రిజిస్ట్రేషన్‌లకోసం ఎంత ప్రయత్నం చేస్తున్నా ఆశించిన ఆదాయం రావడం లేదు. లక్షల్లో దరఖాస్తు చేసుకున్నా వాటికి వేలల్లో కూడా ముందుకు రాకపోవడంతో యంత్రాంగం తలలు పట్టుకుంటోంది.

గడువు రెండు రోజులు.. అయిన రిజిస్ట్రేషన్‌లు 1799

ఈనెల 31లోగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వాటికి 25 శాతం రాయితీ వర్తిస్తుంది. మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉండగా శుక్రవారం నాటికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,799 దరఖాస్తుల రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగాయి. మహబూబ్‌నగర్‌లో 175, జడ్చర్లలో 265 రిజిస్ట్రేషన్లు అయ్యాయి. వనపర్తిలో 549, ఆత్మకూర్‌లో 35, గద్వాలలో 213, అలంపూర్‌లో 47, నారాయణపేటలో 81, మక్తల్‌లో 6, నాగర్‌కర్నూల్‌లో 90, అచ్చంపేటలో 39, కల్వకుర్తిలో 265, కొల్లాపూర్‌లో 34 మాత్రమే రిజిస్ట్రేషన్లు జరిగాయి.

అర్ధరాత్రి దొంగల హల్‌చల్

» కత్తులు, కర్రలతో పెట్రోల్ బంకుపై దాడి
» సిబ్బందిని బెదిరించి నగదు, పరికరాల దోపిడీ

అయిజ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజలోని పెట్రోల్ బంకులు గురువారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. కత్తులు, కర్రలతో సిబ్బందిపై దాడి చేశారు. చంపుతామని బెదిరించి నగదు, పరికరాలను దోచుకెళ్లారు. బంకు యజమాని బుగ్గారెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకులో పని చేసే తిమ్మప్ప, అశోక్, భీమేష్‌లు గురువారం రాత్రి విధులు ముగించుకొని క్యాబిన్లో నిద్రపోయారు. అర్ధరాత్రి తర్వాత 1.45 గంటల సమయంలో 5 గురు వ్యక్తులు ముఖాలకు ముసుగులు ధరించి క్యాబిన్‌లోకి ప్రవేశించారు. కత్తులు, కర్రలతో హల్‌చల్ సృష్టించారు. దీంతో నిద్ర లేచిన సిబ్బందిని చంపుతామని బెదిరించారు. బంకులోని లక్ష రూపాయలతో పాటు, సాంకేతిక, సమాచార పరికరాలను ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న శాంతినగర్ సీఐ టాటాబాబు వెంటనే సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ రంజిత్‌కుమార్, అయిజ ఎస్ఐ శ్రీనివాసరావు శుక్రవారం ఉదయం పెట్రోల్ బంక్‌ను పరిశీలించారు. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.



బంకులో చెల్లాచెదురుగా పడి ఉన్న పరికరాలు

హామీని అమలు చేయాలి

» ఐకేపీ వీవోఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్ కుమార్



కొల్లాపూర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఐకేపీ వీవోఏలు, సీఐటీయూ నాయకులు

కొల్లాపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఐకేపీ వీవోఏలకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని ఐకేపీ వీవోఏల సంఘం రాష్ట్ర అధ్యక్షులడు రాజ్‌కుమార్ కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఐకేపీ వీవోఏలకు ప్రతీ నెల రూ.20వేల వేతనం ఇస్తామని హామీ ఇచ్చిందని, అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఐకేపీ వీవోఏల సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడితే రాష్ట్ర ప్రభుత్వం పోలీసులచే నిర్బంధించిందని అన్నారు. శుక్రవారం ఐకేపీ వీవోఏలపై ప్రభుత్వం నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ కొల్లాపూర్ పట్టణంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహం దగ్గర రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్, ఐకేపీ వీవోఏల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహ, కొల్లాపూర్ మండల అధ్యక్షురాలు లక్ష్మి, పెద్దకొత్తపల్లి మండల అధ్యక్షుడు జగన్, కోడేరు మండల అధ్యక్షుడు నరసింహ, పెంట్లవెల్లి అధ్యక్షురాలు ఈశ్వరమ్మ, అలివేల, బాలకృష్ణ, రాము, బద్రి, అర్జునయ్య, మాధవి, నాలుగు మండలాల ఐకేపీ వీవోఏలు పాల్గొన్నారు.

శ్రీశైలం జలాశయంలో మిగిలింది 44 టీఎంసీలే

» ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో కొనసాగుతున్న విద్యుత్ ఉత్పాదన
» సాగు, తాగునీటి అవసరాలకు సాగర్‌కు నీటి విడుదల
» 805 అడుగుల వరకు నీటిని వాడుకునేందుకు ప్రభుత్వ నిర్ణయం

దోమలపెంట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు రోజు రోజుకు తగ్గుముఖం పడుతున్నాయి. శ్రీశైలం జలాశయంలో ప్రస్తుతం 44 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. ఇందులో 13 టీఎంసీల నీటి ని వాడుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. సాగర్ జలాశయంపై ఆధారపడిన ఆయకట్టు రైతాంగం పంటలు ఎండకుండా సాగు నీటిని అందించడంతో పాటు, హైదరాబాద్ జంట నగరాల తాగునీటి అవసరాలకు వినియోగించుకునేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

మొదట డ్యాం స్లూయిస్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేయాలనుకున్నప్పటికీ, పెద్దగా ఉపయోగం లేదని అంటున్నారు. శ్రీశైలం ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పాదన కొనసాగిస్తూ సాగర్‌కూ నీటి విడుదల చేయడం వలన వేసవిలో విద్యుత్ కొరత అధిగమించి.. నీటిని అవసరాలకు వినియోగించడం వలన రెండు రకాల ఉపయోగాలు ఉన్నట్లు జెన్‌కో అధికారులు పేర్కొంటున్నారు. విద్యుత్ ఉత్పాదన చేస్తూ ఐదు రోజులుగా నీటిని తరలిస్తున్నారు. శుక్రవారం డ్యాం గేజింగ్ అధికారులు తెలిపిన ప్రకారం శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా, 824 అడుగులకు చేరింది. 215.807 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి గాను 44.8708 టీఎంసీల దిగువకు నీటి మట్టం పడిపోయింది. శ్రీశైలం డ్యాంకు ఎగువన ఉన్న ముచ్చుమర్రి 525 క్యూసెక్కులు, ఎంజీకేఎల్ఐ 2400 క్యూసెక్కుల నీటిని మళ్లిస్తుండగా, గడిచిన 24 గంటల వ్యవధిలో ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో 16,247 క్యూసెక్కుల నీటిని వినియోగించి 7.472 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ సాగర్‌కు నీటి విడుదల చేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం 824 అడుగుల వరకు నీటి మట్టం ఉండగా 805 అడుగుల వరకు నీటిని వినియోగించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినట్లు అధికారులు తెలుపుతున్నారు.

నీటి వినియోగం నిలిపివేయాలని ఏపీ అధికారుల లేఖ

తెలంగాణ ప్రభుత్వం సాగు, తాగు అవసరాలను దృష్టిలో ఉంచుకుని శ్రీశైలం డ్యాం నీటి నిల్వల నుంచి 13 టీఎంసీలు వాడుకునేందు నిర్ణయించింది. ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పాదనతో సాగర్‌కు నీటి విడుదలను అరికట్టాలని ఏపీ ప్రభుత్వం కేఆర్ఎంబీ(కృష్ణా రివర్ బోర్డు మేనేజ్‌మెంట్)కి లేఖ రాసినట్లు ఆంధ్ర ఇరిగేషన్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

పుట్టెడు దుఃఖాన్ని దిగమింగి పరీక్షకు హాజరైన విద్యార్థి



పరీక్ష రాసేందుకు వెళుతున్న హేమంత్ నాయక్

మన్ననూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పుట్టెడు దుఃఖాన్ని దిగమించి పరీక్షకు హాజరయ్యాడో విద్యార్థి. ఈ విషాద సంఘటన శుక్రవారం నాగర్‌కర్నూలు జిల్లా, అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో జరిగింది. గ్రామంలోని ఉమామహేశ్వర తండాకు చెందిన విస్లావత్ హేమంత్ నాయక్ స్థానిక గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుకున్నాడు. సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలోని పరీక్ష కేంద్రంలో శుక్రవారం ఫిజికల్ సైన్స్ పరీక్ష రాయాల్సి ఉండింది. గురువారం సాయంత్రం అతడి తండ్రి లక్య నాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేక విలపిస్తున్న హేమంత్‌నాయక్‌ను ప్రధానోపాధ్యాయుడు సిద్ధార్థ మహాదేవ్, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు మోతీలాల్ ఓదార్చి, ధైర్యం చెప్పారు. కేంద్రానికి తీసుకెళ్లి పరీక్ష రాయించారు. ఆ తర్వాత అతడు తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నాడు.

రోడ్డు మధ్యలో నిలిచిన లారీ



మట్టి రోడ్డు మధ్యలో ఇరుక్కున్న లారీ

హన్వాడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇబ్రహీంబాద్ సమీపంలో రోడ్డుపై లారీ ఇరుక్కుపోవడంతో భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడిన ఘటన శుక్రవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. బ్రిడ్జి పనులు జరుగుతున్న సందర్భంగా పక్కనే వాహనాలు వెళ్లేందుకు రోడ్డు వేశారు. రోడ్డుపై గుంతలు పడడంతో బండల లోడ్‌తో వెళ్తున్న లారీ అక్కడికి రాగానే చెడిపోయింది. దీంతో మార్గం లేక ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయాయి. 167 జాతీయ రహదారి కావడంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దాని పక్కనే మారో మార్గంలో రోడ్డు వాహనాల రాకపోకలను కొనసాగించారు.

క్రైం కార్నర్

కుక్కను తప్పించబోయి కారు బోల్తా

» ఒకరి మృతి, మరో ఇద్దరికి స్వల్ప గాయాలు


మీర్జా అస్లం బేగ్ (ఫైల్)

బిజినేపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : వేగంగా వెళ్తున్న కారు, అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి బోల్తాపడింది. ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌లోని గన్‌బజార్ నివాసించే మీర్జా అస్లం బేగ్ (42) భార్య షబానా బేగం, కుమారుడు సుభాన్ బేగ్, కుమార్తె అఫ్రా ఖానంలతో కలిసి శుక్రవారం ఉదయం కారులో అత్తగారి ఊరైన నాగర్‌కర్నూల్‌కు బయలుదేరారు. వారు వస్తున్న కారుకు పాలెం గ్రామ సమీపంలో ప్రధాన రహదారి పక్కనున్న ఈద్గా వద్ద కుక్క అడ్డం వచ్చింది. దాన్ని తప్పించేయత్నంలో కారు బోల్తాపడింది. ప్రమాదంలో అస్లంబేగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. భార్య, పిల్లలు స్వల్పగా గాయపడ్డారు. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించి, వారిని నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మీర్జా అస్లం బేగ్ మృతి చెందాడు. భార్య, పిల్లలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా షబానా బేగం తండ్రి ఎండీ గౌస్ కొంతకాలం క్రితం ప్రమాదానికి గురయ్యారు. ఆయనను పరామర్శించడంతో పాటు, రంజాన్ పండుగకు అత్తగారి ఇంటికి వస్తుండగా ప్రమాదానికి గురైనట్లు బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటనపై మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కె.శ్రీనివాస్ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకార్మికుడి మృతి


నాగరాజు (ఫైల్)

అమరచింత, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, అమరచింత మండలం, నందిమల్ల గ్రామంలో చేపల వేటకు వెళ్లి ఓ మత్స్యకార్మికుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నాగరాజు (28) శుక్రవారం చేపల వేట కోసం పెద్ద (ఊర) చెరువుకు వెళ్లాడు. నీటిలో వల వేసి చెరువులోకి దిగాడు. చెరువులో ఒండ్రు మట్టి కోసం తవ్విన గుంతల్లో నాగరాజు కాళ్లకు వల చుట్టుకున్నది. వలను వదిలించుకునేందుకు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్థానికులు నాటు పడవల సాయంతో గాలించి, మృతదేహాన్ని చెరువులోనుంచి బయటకు తీశారు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న హెడ్ కానిస్టేబుల్ రాములు, కానిస్టేబుల్ రాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

బాలానగర్, మార్చి 28 : మహబూబ్‌నగర్ జిల్లా, బాలానగర్ మండల కేంద్రానికి చెందిన మణిదీప్ (18) అనే యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మణిదీప్ హైదరాబాద్‌లో బీఎస్సీ నర్సింగ్ చదువుతున్నాడు. గురువారం ఉదయం కళాశాలకు వెళ్లి, సాయంత్రం ఇంటికి చేరుకున్నాడు. రాత్రి భోజనం చేసి తన గదిలోకి వెళ్లి నిద్రపోయాడు. ప్రతి రోజు ఉదయం ఆరు గంటల సమయంలో నిద్ర లేచి బయటకు వచ్చేవాడు. కానీ రాకపోవడంతో కుటుంబసభ్యులు తలుపులు కొట్టినా స్పందించలేదు. దీంతో అనుమానం వచ్చిన వారు తలుపులు తొలగించి లోపలికి వెళ్లి చూడగా, చీరతో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొని కనిపించాడు. మణిదీప్ ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు దినపత్రికలు పంపిణీ చేసి, ఆ తర్వాత హైదరాబాద్‌లోని కళాశాలకు వెళ్లేవాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హన్వాడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, హన్వాడ మండలంలోని గొండ్యాల గ్రామానికి చెందిన బోయిని బాలకిష్టయ్య (65) అనారోగ్యం భరించలేక ఈనెల 21న ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు గమనించి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్కూటీ, లారీ ఢీ, ఇద్దరికి గాయాలు



లారీ కింద పడిన స్కూటీ

హన్వాడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : లారీ, స్కూటీ ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లా, హన్వాడ మండలం, చిన్నదర్పల్లి సమీపంలో శుక్రవారం ఈ ప్రమాదం జరిగింది. హన్వాడ గ్రామానికి చెందిన మాడిమడ తిరుపతయ్య, సత్యయ్యలు స్కూటీపై జిల్లా కేంద్రానికి వెళ్తున్నారు. చిన్నదర్పల్లిలోని దేవాలయం వద్ద రోడ్డు పనులు జరుగుతున్నందున, వాహనాలు ఒక వైపునుంచే వెళ్తున్నాయి. అదే దారిలో నిదానంగా వెళ్తున్న స్కూటీని వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టడంతో ఇద్దరూ కిందపడ్డారు. గాయపడిన వారిద్దరినీ చుట్టుపక్కల వారు ఆసుపత్రికి తరలించారు. స్కూటీ లారీ కింద పడి పూర్తిగా దెబ్బతిన్నది.

చిరుత దాడిలో లేగదూడ మృతి

మద్దూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : చిరుత దాడిలో లేగదూడ చనిపోయింది. నారాయణపేట జిల్లా, మద్దూర్ గ్రామానికి చెందిన తలారి రాములు గురువారం సాయంత్రం గ్రామ శివారులోని ఎలగల గట్టు దగ్గర ఉన్న తన పొలంలో పశువులను కట్టేసి ఇంటికి వచ్చాడు. అర్ధరాత్రి సమయంలో చిరుత పులి దాడి చేసి, ఓ లేగదూడను చంపేసింది. తరుచూ ఇలాంటి ఘటనలు జరుగుతుండటంతో పొలానికి వెళ్లాలంటే భయమవుతోందని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అటవీశాఖ అధికారులు స్పందించి, చిరుతల దాడి నుంచి తమను, పశువులను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు


గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన కర్ణాటక వాసి సిద్ధప్పతో ఎక్సైజ్ అధికారులు

నారాయణపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం, గుంజనూర్‌కు చెందిన సిద్ధప్ప మూడు నెలలుగా అప్పుడప్పుడు నారాయణపేటకు వస్తున్నాడు. పట్టణంలోని సింగారం చౌరస్తాలో కొందరు యువకులకు గంజాయి విక్రయించి వెళ్లిపోయేవాడు. అదే విధంగా శుక్రవారం 150 గ్రాముల గంజాయిని తీసుకొని నారాయణపేటకు చేరుకున్నాడు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ అధికారులు దాడి చేసి అతడిని పట్టుకున్నారు. అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ గురువయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి సాయం


తుపత్రాళ్ల శివారులోని పొలంలో బోరుబావి


అయిజ మండలం, తాండ్రపాడు శివారులోని పొలంలో బోరుబావి

» ఎస్సీ రైతులకు ఉచితంగా బోరు బావులు
» జోగులాంబ గద్వాల జిల్లాకు 250 మంజూరు
» భూగర్భ జలవనరుల శాఖ ఆధ్వర్యంలో డ్రిల్లింగ్
» వచ్చే నెల 2వ తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం

అయిజ టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ రైతులకు సాగునీటి సాయం అందించేందుకు సిద్ధం అయ్యింది. ఆయా సామాజిక వర్గాలకు చెందిన చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయం కోసం ఉచితంగా బోరు బావులు తవ్వించే పథకాన్ని ప్రకటించింది. ఇప్పటికే మండల కేంద్రాల్లో రైతుల నుంచి ఎంపీడీవోల ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తోంది. వాటిని ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో భూగర్భ జలవనరుల శాఖ అధికారులు పరిశీలించనున్నారు. అర్హులైన రైతులను ఎంపిక చేసి వారి పొలాల్లో బోరు బావులను తవ్వించనున్నారు.

జోగులాంబ గద్వాల జిల్లాలో...

జోగులాంబ గద్వాల జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల ప్రకారం 1,98,352 మంది రైతులు ఉన్నారు. వీరిలో 20 నుంచి 25 వేల మంది రైతులు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన చిన్న, సన్న కారు రైతులు ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. వారందరికీ విడతల వారీగా ఈ పథకాన్ని వర్తింపచేయనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ అధికారులు చెప్తున్నారు. ప్రస్తుతం తొలి విడతలో జిల్లాకు 250 బోరుబావులు మంజూరయ్యాయి. ఆయా గ్రామాల్లోని చిన్నసన్నకారు రైతుల నుంచి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఏప్రిల్ రెండవ తేదీ లోపు రైతుల నుంచి దరఖాస్తుల ను స్వీకరించి, వాటిని రాష్ట్ర భూగర్భ జలవనరుల శాఖకు పంపించాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఎస్సీ రైతులకు సువర్ణావకాశం

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బోరుబావుల పథకం ఎస్సీ చిన్న, సన్నకారు రైతులకు సువర్ణవకాశమని పలువురు అభిప్రాయపడుతున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని ఎస్సీ రైతులకు ఉన్న రెండెకరాలు, ఎకరం, అర ఎకరం భూముల్లో బోర్లు తవ్వించేందుకు ఆర్థిక పరిస్థితి సహకరించేది కాదు. దీంతో వర్షాధారంగా పంటలు సాగు చేసుకోవాల్సి వస్తోంది. కాలం కలిసిరాక ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోతే సాగు ముందుకు సాగేది కాదు. ఉపాధి కోసం వలస వెళ్లక తప్పేది కాదు. తాజాగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచితంగా బోరుబావుల పథకంతో వారికి ఎంతో మేలు జరగనున్నది. భూగర్భ జలవనరుల శాఖ అధికారులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తిస్తారు. అనంతరం దరఖాస్తుదారుల పొలాల్లో సర్వేచేసి భూమిలో నీరు ఉన్నది, లేనిది పరిశీలిస్తారు. ఆ తర్వాతే బోరు డ్రిల్లింగ్‌కు అనుమతి ఇస్తారు. ఆశించిన మేర బోర్లలో నీరు పడితే ఏడాది పొడవునా పంటలు సాగు చేసుకునే అవకాశం కలుగనున్నది.

మంచి నిర్ణయం



ఎస్సీ రైతులకు ప్రభుత్వం ఉచితంగా బోరుబావులను మంజూరు చేయటం చాలా మంచి నిర్ణయం. ఎస్సీ రైతుల్లో 90 శాతం చిన్న, సన్నకారు రైతులే ఉంటారు. దానికి తోడు సొంత డబ్బుతో బోరుబావులు తవ్వించుకునే స్తోమత వారికొండదు. దీంతో వారు జీవనోపాధి కోసం ఏడాదిలో 6 నెలలు వలస వెలుతుంటారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో వలసలు తగ్గుతాయి.

శాంసన్, రైతు, కొత్తపల్లి, అయిజ మండలం

జనాభా నిష్పత్తి ప్రకారం మంజూరు



జోగులాంబ గద్వాల జిల్లాకు ఉచిత బోరుబావులు 250 మంజూరయ్యాయి. ఆయా మండలాల్లోని చిన్న, సన్నకారు ఎస్సీ రైతుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నాము. ఏప్రిల్ 2వ తేదీలోపు దరఖాస్తులను స్వీకరించి రాష్ట్ర భూగర్భ జలవనరుల శాఖ అధికారులకు అందిస్తాం. జిల్లాలోని ఎస్సీ జనాభా నిష్పత్తి ప్రకారం ఉచిత బోరుబావులు మంజూరు అవుతాయి.

రమేశ్‌బాబు, ఎస్సీ కార్పొరేషన్, ఈడీ, గద్వాల జిల్లా

కల్లు డిపోపై ఎన్‌ఫోర్స్‌మెంటు దాడులు

గద్వాల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన కల్లు డిపోలు, కల్లుదుకాణాలపై మహబూబ్‌నగర్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు గురువారం దాడులు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గద్వాల నియోజకవర్గంలోని పలు గ్రామాలు, మండలాల్లో కొందరు అనుమతులు లేకుండా కల్లు డిపో, కల్లు దుకాణాలను ఏర్పాటు చేసి విక్రయాలు కొనసాగిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన రెండు వర్గాల నాయకుల అనుచరులు వీటిని నిర్వహిస్తున్నట్లు సమాచారం. కల్లులో నిషేధిత మత్తు పదార్థాలను కలిపి విక్రయిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు దాడులు నిర్వహించారు. విషయాన్ని ముందే పసిగట్టిన విక్రయదారులు అధికారులు రాకముందే కల్లు డిపోతో పాటు అనుమతులు లేని దుకాణాలను మూసేసి వెళ్లిపో యారు. దీంతో అధికారులు చేసేదేమీ లేక అక్కడ నిల్వ ఉంచిన కల్లు పెట్టెలను స్వాధీనం చేసుకొని తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ విషయంపై ఎక్సైజ్ సీఐ గణపతిరెడ్డిని 'ఆంధ్ర జ్యోతి' వివరణ కోరగా ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు దాడులు నిర్వహించింది వాస్తవమేనని తెలిపారు. అయితే ఎలాంటి కేసులూ నమోదు కాలేదని చెప్పారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలు భరించలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్నది. సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగరాజు, పొరమోని పావని అనే దంపతులు జిల్లా కేంద్రంలోని ఈశ్వర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఇద్దరూ కూలి పని చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. వారిద్దరి మధ్య మనస్పర్థలు తలెత్తి తరుచూ గొడవలు పడుతున్నారు. ఇటీవల మరో సారి గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన పావని శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఈ సంఘటనపై ఆమె అక్క కొడుకు ఉదయ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

నిరంతరాయంగా సహాయక చర్యలు

» ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి
» రిస్క్యూ బృందాల ఉన్నతాధికారులతో సమీక్ష
» ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం జరిగి 35 రోజులు


సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శివశంకర్, చిత్రంలో నాగర్‌కర్నూల్ ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, అధికారులు

దోమలపెంట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, దోమలపెంట సమీపంలోని ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యలను నిరంతరాయంగా కొనసాగిస్తున్నట్లు ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి తెలిపారు. ప్రమాదం జరిగి 35 రోజులు గడిచిన సందర్భంగా శుక్రవారం టన్నెల్ వద్ద రెస్క్యూ బృందాల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయనతో పాటు, నాగర్‌కర్నూల్ ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివశంకర్ లోతేటి మాట్లాడుతూ సొరంగంలోని శిథిలాలను వేగంగా బయటకు తరలిస్తున్నట్లు తెలిపారు. జీఎస్‌ఐ అధికారుల సూచన మేరకు సొరంగంలో 30 మీటర్ల వరకు ఇనుప కంచె వేసినట్లు తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న ప్రాంతంలో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో టెలిటెల్, బాక్స్ క్రిప్ స్ట్రక్చర్ లాంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిరంతరం పర్యవేక్షిస్తూ సహాయక చర్యలను చేపడుతున్నట్లు చెప్పారు. సమీక్షా సమావేశంలో ఆర్మీ అధికారి వికాస్ సింగ్, మేజర్ డాక్టర్ విజయ్‌కుమార్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, కల్వకుర్తి ఆర్డీవో శ్రీనివాసులు, ఎన్‌డీఆర్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ కిరణ్‌కుమార్, ఎస్‌డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్ రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే అధికారి నేతి చంద్ర, హైడ్రా అధికారి యజ్ఞ నారాయణ, ర్యాట్ హోల్ మైనర్స్, జెపీ కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.



సొరంగంలోకి రెస్క్యూ బృందాలను పంపిస్తున్న ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి

కన్వేయర్ బెల్ట్ పొడిగింపు

సహాయక చర్యల్లో మరింత వేగం పెంచేందుకు డీ1, డీ2 ప్రాంతాల వరకు కన్వేయర్ బెల్ట్‌ను పొడిగించేందుకు రెస్క్యూ బృందాలు పనులు చేపట్టాయి. ప్రస్తుతం టన్నెల్‌లో నుంచి టీబీఎం విడి భాగాలను థర్మల్ కట్టర్ల ద్వారా కత్తిరించి లోకో ట్రైన్ ద్వారా బయటకు తీసుకొస్తున్నారు.

కన్వేయర్ బెల్ట్ ద్వారా మట్టి, బురదను తరలిస్తు న్నారు. శిథిలాల కింద కూరుకు పోయిన లోకో ట్రైన్ ఎత్తు 2.1, వెడల్పు 1.6, పొడవు 7.5 మీటర్లు ఉంటుంది. దానిని బయటకు తీసుకు రావడంతో యంత్రాలు తిరిగేందుకు కొంత వెసులుబాటు కలుగుతోందని అధికారులు చెప్తున్నారు. టీబీఎం కూరుకుపోయి, ప్రమాదకరంగా ఉన్న 30 మీటర్ల దూరాన్ని మినహాయించి, 185 మీటర్ల వరకు ఉన్న శిథిలాలను తొలగిస్తు న్నారు. ఈ పనుల్లో ప్రతీ రోజు 600 మంది పాల్గొంటున్నారు. నిరంతరా యంగా పనులను కొనసాగించినా, శిథిలాలను పూర్తిగా తొలగించేందుకు మరో రెండు వారాల సమయం పట్టొచ్చని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

» కేంద్రాలను పరిశీలించిన ఉన్నతాధికారులు


నాగర్‌కర్నూల్ జిల్లా, చారగొండ జడ్పీహెచ్ఎస్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో రమేశ్‌కుమార్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/ వనపర్తి విద్యావిభాగం/ నారాయణపేట/ గద్వాల సర్కిల్/ నాగర్‌కర్నూల్ టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా శుక్రవారం భౌతిక, రసాయన శాస్త్రం పరీక్ష నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని 60 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 99.61 శాతం హాజరయ్యారు. మొత్తం 12,944 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 12,894 మంది హాజరయ్యారు. 50 మంది గైర్హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థులు 12,769 మందికి గాను, 12,736 మంది హాజరు కాగా, 33 మంది హాజరు కాలేదు. ప్రైవేట్ విద్యార్థులు 175 మందికి గాను, 158 మంది పరీక్ష రాశారు. 17 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను కలెక్టర్ విజయేందర బోయి, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఎస్పీ జానకి, అదనపు ఎస్పీ పరిశీలించారు.

- వనపర్తి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 36 పరీక్ష కేంద్రాల్లో 6,853 మందికి గాను, 6839 మంది హాజరయ్యారు. 14 మంది గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని చాణక్య పాఠశాల పరీక్ష కేంద్రాన్ని జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని పరిశీలించారు.
- నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఉన్న 39 పరీక్షా కేంద్రాల్లో 7,635 మంది విద్యార్థులకు గాను, 7616 మంది పరీక్షకు హాజరయ్యారు. 19 మంది గైర్హాజరయ్యారు. డీఈవో గోవిందరాజులు ఐదు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.
- జోగులాంబ గద్వాల జిల్లాలోని 40 కేంద్రాల్లో 99.59 శాతం విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మొత్తం 7,600 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 7,569 మంది హాజరయ్యారు. 31 మంది పరీక్ష రాయలేదని ఇన్‌ఛార్జి డీఈవో అబ్దుల్ ఘని, పరీక్షల జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. గద్వాల పట్టణంలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల, విశ్వభారతి ఉన్నత పాఠశాల, ధరూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను రాష్ట్ర పరిశీలకుడు దుర్గాప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులు తనిఖీ చేశారు.
- నాగర్‌కర్నూల్ జిల్లాలోని 60 పరీక్ష కేంద్రాల్లో 10,584 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా, 10,556 మంది పరీక్ష రాశారు. 28 మంది గైర్హాజరయ్యారు. వంగూరు, చారకొండ పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ తనిఖీ చేశారు. అంతకు ముందు చారకొండ పోలీసుస్టేషన్ నుంచి జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లతో డీఈవో సెట్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పరీక్ష కేంద్రాల్లోని ప్రతీ గదిని పరిశీలించాలని, ఇన్విజిలేటర్లకు అవసరమైన సూచనలు చేయాలని ఆదేశించారు.

హత్య కేసులో నేరస్థుడికి జీవిత ఖైదు

» రూ.10 వేల జరిమానా
» మహబూబ్‌నగర్ సెషన్స్ న్యాయాధికారి తీర్పు


నిందితుడు చాకలి వెంకటన్న

ధరూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మహిళ హత్య కేసులో నేరస్థుడికి జీవిత ఖైదు విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్, జిల్లా పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, ధరూరు మండల కేంద్రా నికి చెందిన మాల బీసమ్మ (40) కూలీ పనిచేస్తూ జీవనం సాగించేది. అదే గ్రామానికి చెందిన చాకలి వెంకటన్న అనే వ్యక్తికి ఆమెతో వివాహేతర సంబంధం ఉండేది. అయితే ఆమెకు ఇతరులతోనూ సంబంధం ఉందని ఆరోపిస్తూ వేధిస్తుండేవాడు. ఈ క్రమంలో 2016, నవంబరు 20న మధ్యాహ్నం ఆమె తన ఇంట్లో పత్తి గిల్లుతూ ఉండగా, చాకలి వెంకటన్న వచ్చి దుర్భాషలాడుతూ చంపుతానని బెదిరించాడు. అక్కడే ఉన్న కిరోసిన్‌ను ఆమెపై పోసి అగ్గిపుల్లతో నిప్పంటించి పారిపోయాడు. మంటల బాధ భరించలేక ఆమె కేకలు వేయడంతో, స్థానికులు అక్కడికి చేరుకొని, అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారు. చంపాలనే ఉద్దేశంతోనే వెంకటన్న తనపై కిరోసిన్ పోసి నిప్పంటించాడని, అతడిపై తగు చర్యలు తీసుకోవాలని బాధితురాలు విచారణాధికారికి వాంగ్మూలం ఇచ్చింది. దీంతో ధరూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు అదే సంవత్సరం డిసెంబరు 15న గద్వాల కోర్టు న్యాయాధికారి ముందు మరణ వాంగ్మూలం ఇచ్చింది. అదే రోజు అర్ధరాత్రి మృతి చెందింది. అనంతరం విచారణ చేపట్టిన అప్పటి గద్వాల డీఎస్పీ బాలకోటి నిందితుడిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపారు. విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు ఆదేశానుసారం, డీఎస్పీ మొగిలయ్యమహబూబ్‌నగర్ కోర్టులో కేసు ట్రయల్ సమయంలో సీఐ టి.శ్రీను, ధరూర్ ఎస్‌ఐ శ్రీహరి పూర్తి వివరాలను న్యాయాధికారికి సమర్పించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన అనంతరం మహబూబ్‌నగర్ అడిషనల్ అండ్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి శారదా దేవి ఇరుపక్షాల వాదనలు విన్నారు. నేరం రుజువు కావడంతో చాకలి వెంకటన్నకు జీవిత కాల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించారు. నేరస్థుడికి శిక్ష పడేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్‌హెచ్ రాజేశ్వర్ రావు, కోర్టు లైజనింగ్ అధికారి, ఏఎస్‌ఐ నర్సింహులు సహకరించారు. ఈ సందర్భంగా ఇన్వెస్టిగేషన్ అధికారులు, అప్పటి డీఎస్పీ బాలకోటి, పబ్లిక్ ప్రాసిక్యూటర్, ప్రస్తుత డీఎస్పీ, ధరూరు కోర్టు కానిస్టేబుల్ గజేంద్రలను ఎస్పీ అభినందించారు.



ఎండుతున్న వరి పంటలు

- ఆందోళన చెందుతున్న రైతులు

వీపనగండ్ల, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మార్చి మాసం ఆరంభంలోనే ఎండల తీవ్రత అధికమైంది. ఎండలకు భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. బోరు బావులు వట్టి పోతుండటంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. బోర్లలో నీరు లేక పంటకు అందకపోవడంతో పంటలను కాపాడుకునే ప్రయత్నంలో రైతులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. వీపనగండ్ల మండలంలో 9,500 ఎకరాల్లో పంట సాగు కాగా.. 1300 ఎకరాల్లో బోర్లు బావుల కింద వరి పంట సాగు చిరు పొట్ట దశలో ఉంది. ఈ సమయంలో వరి పంటకు అధిక నీరు అవసరం ఉంటుంది. కానీ ఎండల తీవ్రత అధికం కావడం, బోరు బావులు ఇంకిపోవడంతో నీళ్లు దొరకని పరిస్థితి ఏర్పడింది. పంటలకు సాగునీరు లేక ఎండిపోతున్నాయి. బోర్లు బావుల్లో నీళ్లు తగ్గిపోవడంతో కొంత మంది రైతులు కొంత పంటను వదులుకొని కొంత పంట కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. పంటలను కాపాడుకునేందుకు కొత్తగా బోర్లు వేస్తున్నారు. మరికొంత మంది నీటిని కొనుగోలు చేసి పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయినా ఫలితం కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సంగినేనిపల్లి, వీపనగండ్ల మధ్యలో నీరు లేక ఎండిన వరి పంట

- మండల పరిధిలోని సంగినేనిపల్లిలో బండారి కృష్ణయ్య దాదాపు రెండు ఎకరాల పొలం నీళ్లు లేక ఎండిపోయింది. రాముడు ఎకరా, మహంకాళి, రాముడు, రాజు, రవిలకు చెందిన ఒక్కొక్కరిది అర ఎకరా పొలం నీళ్లు లేక ఎండిపోయింది. గోవర్ధనగిరిలో గట్టు సురేష్ ఎకరా, బేబి అర ఎకరా, దానయ్య పొలం మూడు ఎకరాలు ఎండిపోయింది. కల్వరాల గ్రామంలో గొల్ల భాస్కర్ వరి పంట ఎకరా, మద్దిలేటి అర ఎకరా పొలం ఎండిపోయింది.

పెట్టుబడి కూడా రాదు



వరి పంట సాగు చేసిన రైతులకు పంటలు ఎండిపోతుండటంతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ఎండ తీవ్రత అధికమై భూగర్భ జలాలు అడుగంటి బోర్లు బావులు ఇంకిపోతున్నాయి. సాగునీరు అందక వరి పంట ఎండిపోయింది.

- రాజు, సంగినేనిపల్లి, రైతు

బోరు వేసినా ఫలితం లేదు.



రెండు ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. బోరు బావిలో నీరు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. కాపాడుకునేందుకు రూ.68 వేలు ఖర్చు చేసి బోరు వేశాను. ఫలితం లేదు. ఎకరన్నర ఎండిపోయింది. దాదాపు లక్ష 30వేల నష్టం వాటిల్లింది.

- రాముడు, సంగినేనిపల్లి, రైతు

న్యూస్ బాక్స్

చౌకధర దుకాణాలకు సన్న బియ్యం

ఆత్మకూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలోని తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతీ ఒక్కరికి ఉగాది పండుగ రోజున సన్న బియ్యం పంపిణీ చేస్తామని ఆత్మకూరు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాయచూర్ పరమేష్, పట్టణ అధ్యక్షుడు నల్గొండ శ్రీనివాసులు పేర్కొన్నారు. అందులో భాగంగానే శుక్రవారం నుంచి ఆత్మకూరు సివిల్ సప్లయ్ గోదాం నుంచి చౌకధర దుకాణాలకు బియ్యం తరలించినట్లు తెలిపారు.

ముస్లింల నిరసన

ఆత్మకూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ బోర్డుపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ.. ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని నాలుగు మసీదుల్లో ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముస్లిం నాయకులు జియావూర్ రహమాన్ మాట్లాడారు. నరేంద్రమోదీ ప్రభుత్వం వక్ఫ్ ఆస్తులను దేశంలోని అన్ని మతాల కులాలకు సమానంగా పంచాలని పార్లమెంటులో బిల్లు ప్రవేశ పెట్టిందని, అది సరైంది కాదని అన్నారు. నల్ల బ్యాడ్జీలు ధరించి ఉపవాస దీక్షలతో వారు శాంతియుతంగా నిరసన తెలిపారు. అజ్మతుల్లా అబ్దుల్ అలీమ్, షమీం, ముక్తదీర్, ఫిరోజ్, పాల్గొన్నారు.

ఆర్మీకి ఒకే తండా నుంచి ఇద్దరు యువకుల ఎంపిక

పెద్దమందడి, మార్చి 28, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అమ్మపల్లి తండా గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు బబ్లూనాయక్, విజయ్‌నాయక్ ఆర్మీకి ఎంపికయ్యారు. వారి తండాలోనే ఆర్మీ ఉద్యోగం సాధించడం ఇదే మొదటిసారి అని తెలిపారు. దీంతో తండా ప్రజలు వారిని అభినందించారు. తండాలోని మిగితా వారు కూడా ఇలాగే కష్టపడి దేశానికి సేవ చేసేలా ఉద్యోగాలు సాధించాలని కోరారు.

అంబులెన్స్‌లో ప్రసవం

వీపనగండ్ల, మార్చి 28, (ఆంధ్రజ్యోతి) : చిన్నంబావి మండలం వెల్టూరుకి చెందిన గర్భిణికి ఉదయం నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అంబులెన్స్ వచ్చి వీపనగండ్ల ఆసుపత్రికి తరలిస్తుండగా... మార్గమధ్యలో నొప్పులు అధికమవడంతో అంబులెన్స్ సిబ్బంది రాము, మునిద్దీన్‌లు ఆమెకు కాన్పు చేశారు. తల్లీకూతురు ఆరోగ్యంగా ఉన్నారని, వారిని ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

డాక్టర్ సాయినాథ్‌రెడ్డికి సన్మానం



సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

వనపర్తి వైద్యవిభాగం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ సాయినాథ్‌రెడ్డిని జిల్లా టీబీ ప్రోగ్రాం కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డాక్టర్ సాయినాథ్ రెడ్డిని జిల్లా టీబీ ప్రోగ్రాం టీం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి పూల మొక్క అందించి అభినందించారు. క్షయ వ్యాధిపై రాష్ట్రంలోనే ఉత్తమ ప్రదర్శన కనబర్చిన జిల్లాగా వనపర్తి ఎంపిక కావడం తెలిసిన విషయమే. అందుకుగాను ఈ నెల 24న ఢిల్లీలో డాక్టర్ సాయినాథ్‌రెడ్డికి జాతీయ టీబీ ప్రోగాం కమిటీ సభ్యులు అవార్డును అందించారు. విషయం తెలుసుకున్న జిల్లా టీబీ ప్రోగ్రాం కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. డాక్టర్ సందీప్, అనామిక, రాజేంద్రప్రసాద్, వినోద్ పాల్గొన్నారు.

ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

పెబ్బేరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ మాసం సందర్భంగా మసీద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో శుక్రవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి పాల్గొన్నారు. నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు ఫలహారాలు తినిపించారు.

పెద్దమందడి : మండల పరిధిలోని వెల్టూరులోని మసీదులో శుక్రవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే మేఘారెడ్డి పాల్గొన్నారు.

నాటవెల్లిలో..

కొత్తకోట : మండలంలోని నాటవెల్లిలో రంజాన్ ఉపవాస దీక్షలో ఉంటున్న ముస్లింలకు ఆ గ్రామ మైనార్టీ నాయకుడు బషీర్ శుక్రవారం ఇఫ్తార్ ఇచ్చారు. గ్రామానికి చెందిన నాయకులు విష్ణు, కృష్ణయ్య, లతీఫ్, ఇమామ్ సాబ్ ప్రార్థనలు చేశారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

పెబ్బేరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆకాంక్షించారు. పెబ్బేరు మునిసిపాలిటీకి చెందిన అజయ్ కుమార్ రెడ్డి ఇటీవల తెలంగాణ గ్రూప్ 2 ఫలితాల్లో జోనల్ టాప్ ర్యాంకు సాధించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శుక్రవారం అభ్యర్థి నివాసంలో అజయ్ కుమార్ రెడ్డిని శాలువా పూల మాలలతో ఘనంగా సత్కరించారు.

వంద రోజుల పని కల్పించాలి

శ్రీరంగాపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నాగసానిపల్లిలో శుక్రవారం రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు ఉపాధి కూలీలతో మాట్లాడారు. వంద రోజుల పని కల్పించి, కొలతలతో నిమిత్తం లేకుండా కూలీ ఇవ్వాలన్నారు.

స్వయం ఉపాధి యూనిట్ నెలకొల్పాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మహిళా సంఘాల ద్వారా ప్రతీ మండలానికి ఒక స్వయం ఉపాధి యూనిట్ నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఏపీఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల స్వయం ఉపాధి సాధికారత కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పేలా మహిళా సంఘాలను ప్రోత్సహించాలని ఏపీఎంలను ఆదేశించారు. పెట్రోల్ బంక్, గోదాములు, రైస్ మిల్లు మరేదైనా వ్యాపారం మొదలు పెట్టేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్‌చార్జి యాదయ్య, ఉమాదేవి, అరుణ, ఏపీఎంలు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు ఉపయోగించుకోవాలి

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచ్ సేవలను ఉద్యోగులు, సిబ్బంది ఉపయోగించుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. కలెక్టరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌ను శుక్రవారం అదనపు కలెక్టర్ యాదయ్య యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ సత్యనారాయణతో కలిసి రిబ్బన్ కట్ చేసి ఆయన ప్రారంభించారు.

ప్రశాంత వాతావరణంలో...

జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల సీఈవో సుదర్శన్ రెడ్డి చట్టాల అమలు, శాంతి భద్రతలు, ఓటరు జాబితా సవరణపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో మీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలి



విద్యార్థులకు వివరిస్తున్న అధ్యాపకుడు కురుమూర్తి

శ్రీరంగాపూర్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని శ్రీరంగాపూర్ జూనియర్ కళాశాల లెక్చరర్ కురుమూర్తి అన్నారు. శ్రీరంగాపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ కావాలని సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో పరీక్ష పూర్తయిన తరువాత 156 మంది విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. శ్రీరంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ తీసుకున్న ప్రతీ విద్యార్థికి ఉచితంగా పాఠ్యపుస్తకాలు, రూ. పదివేల స్కాలర్‌షిప్, ఉచిత అడ్మిషన్, విద్యాబోధన, సైన్స్ ల్యాబ్‌లు, సొంత భవనం, మంచి ఫర్నీచర్, 25 సంవత్సరాల అనుభవం ఉన్న లెక్చరర్ లతో విద్యాబోధన ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో కామర్స్ లెక్చరర్ కురుమూర్తి, సీనియర్ అసిస్టెంట్ వెంకటన్న పాల్గొన్నారు.

పంటలు ఎండిపోకుండా సాగునీరు అందించాలి



చిన్నారెడ్డికి వినతిపత్రాన్ని అందిస్తున్న రైతులు

పెబ్బేరు రూరల్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జూరాల ప్రధాన ఎడమ కాలువ కింద పంటలను సాగుచేసుకున్న రైతులకు సాగునీరు అందించి పంటలను కాపాడాలని పెబ్బేరు మండలం రైతులు శుక్రవారం రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డిని హైదరాబాద్ ప్రజాభవన్ వద్ద కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా డీ-18, డీ-19 డిస్ట్రిబ్యూటర్స్ వరకు ఏప్రిల్ చివరి నాటికి నీటిని విడుదల చేయాలని కోరారు. జూరాల అధికారులతో మాట్లాడి నీటి నిల్వ ఉంటే విడుదల చేయాలని కోరుతామని చిన్నారెడ్డి రైతులకు తెలియజేశారు. రాంపురం, తోమాలపల్లె, బునాదిపురం గ్రామాల రైతులు పాల్గొన్నారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

గోపాల్‌పేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నరసింగాయిపల్లికి చెందిన దేవేళ్ల కిష్టయ్య మంగళవారం వనపర్తి నుంచి గ్రామానికి బైక్‌పై వెళ్తూ.. కింద పడ్డాడు. కిష్టయ్యకు చెవి, తలకు బలమైన గాయాలు కావడంతో హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ.. శుక్రవారం మృతి చెందాడు. భార్య ఈదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కిరాణం డబ్బాలో చోరీ

మండలంలోని బుద్దారం గండి గురుకుల పాఠశాల వద్ద ఉన్న కిరాణా డబ్బాలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి డబ్బాను పగలగొట్టి ఐదు లీటర్ల పెట్రోల్, రూ.8,500 ఎత్తుకెళ్లినట్లు బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

నేడు ఇసుక వేలం

మదనాపురం : మండలంలోని గోవిందహళ్లిలో ఇటీవల సీజ్ చేసిన 30 ట్రాక్టర్ల ఇసుకకు శనివారం తహసీల్దార్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అబ్రహంలింకన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక ట్రాక్టర్ రూ.1800 ధర నిర్ణయించడం జరిగిందని వేలంలో అధిక ధరకు దక్కించుకున్న వారికి ఆ ఇసుకను కేటాయిస్తామని చెప్పారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ నిర్వహిస్తున్న నాయకులు

కొత్తకోట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వడ్డెవాటలో జాతీయ ఉపాధిహామీ పథకం కింద మంజూరైనా రూ.15.70 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణాలకు గ్రామ నాయకులు శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ నిధులతో గ్రామ అంతర్గత రోడ్లన్నీ సీసీతో నిర్మాణం చేస్తామన్నారు. భానుప్రకాష్‌రెడ్డి, రాములు, నారాయణ, జ్ఞానేందర్ నాయుడు, యుగందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, బలరాం, తిరుపతయ్య, నరసింహ, సతీష్, శేఖర్‌గౌడ్, వెంకటయ్య, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత ..

వడ్డెవాటకి చెందిన రమేష్ అనారోగ్యంతో చికిత్స పొందాడు. దీంతో సీఎం కార్యాలయం నుంచి మంజూరైన రూ.25 వేల ఎల్‌వోసీని లబ్ధిదారుడు భార్య పద్మకు అందజేశారు. అలాగే అనారోగ్యంతో మృతిచెందిన నాగన్నకు సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేల నగదును అందజేశారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అందజేత

గోపాల్‌పేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన మదగం శ్రీను తన ఫోన్‌ను గ్రామంలో పోగొట్టుకున్నాడు. సెల్‌ఫోన్ పోయిన వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీస్ సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి బాధితుడికి తిరిగి సెల్‌ఫోన్ అందజేశారు. ప్రజలు తమ సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పోలీసులు తెలిపారు.

ముస్లింలకు సరకుల పంపిణీ

వనపర్తి టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద ముస్లిం మైనార్టీలకు తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు ఎంఏ ఖాదర్ పాష నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో దాదాపు వంద మందికి పైగా నిరుపేద ముస్లిం మహిళలకు రంజాన్ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. రాజారాం ప్రకాష్, పోచ రవీందర్ రెడ్డి, నమీ, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

తాగునీటిని సరఫరా చేయాలి

అమరచింత, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో ప్రజల ఇబ్బందులను గుర్తించి తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా కొనసాగించాలని మిషన్ భగీరథ సూపరింటెండెంట్ ఇంజినీర్ కొల్లు వెంకటరమణను శుక్రవారం సీపీఎం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి జీఎస్ గోపి మాట్లాడారు. అమరచింత మునిసిపాలిటీలోని 10 వార్డుల్లో 20వేల పైచిలుకు జనాభా ఉందని మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ నీటి విడుదలలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గోపి, రాజు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి అక్రిడిటేషన్ అందించేలా కృషి చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న మధుగౌడ్

వనపర్తి టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అర్హులైన ప్రతీ ఒక్క జర్నలిస్టుకు అక్రిడిటేషన్ అందించేలా కృషి చేస్తామని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధు గౌడ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని యాదవ సంఘ భవనంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జర్నలిజం వృత్తిలో ఉంటూ... నిజమైన కథనాలను రాస్తూ.. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటున్న జర్నలిస్టులందరికీ యూనియన్ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. యూనియన్ నాయకులు మాదవరావు, బాలస్వామి, బాలకృష్ణ, ఉషన్న, పార్థరెడ్డి, శ్రీనివాసరావు, ప్రశాంత్, రాజు, భాస్కర్, రవికాంత్, విజయ్, యాదిరెడ్డి పాల్గొన్నారు.

ఈద్గా వద్ద పారిశుధ్య పనులు

అమరచింత, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర రంజాన్ (ఈద్ ఉల్ ఫితర్) పండుగ సందర్భంగా అమరచింత దర్గాలో శుక్రవారం మునిసిపల్ సిబ్బంది ముళ్లచెట్లు చెత్తా చెదారాన్ని తొలగించారు. సోమవారం జరిగే రంజాన్‌ను పురస్కరించుకుని ఈద్గా పరిసర ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాన్ని తొలగించారు.

కొత్తకోట : పట్టణంలోని వడ్డెవాట రోడ్డు సమీపంలోని ఈద్గా పరిసరాలను ఎక్స్‌కవేటర్ సాయంతో మునిసిపల్ అధికారులు శుక్రవారం శుభ్రం చేయించారు. పనులను మునిసిపల్ కమిషనర్ సైదయ్య పర్యవేక్షించగా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు లతీఫ్, ఏజాజ్ అలి, మతీన్, మహమ్మద్, ఖలీల్, బాబా పాల్గొన్నారు.

పనులు నాణ్యతతో పూర్తి చేయాలి

పెబ్బేరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : నాణ్యవంతంగా పనులను త్వరగా పూర్తి చేయాలని మునిసిపల్ శాఖ ఎస్ఈ చిన్నారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం పెబ్బేరు మునిసిపాలిటీలో చేపడుతున్న వనపర్తి రోడ్డు, డ్రైనేజీ, పైపులైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నిబంధనల ప్రకారం నిర్మాణ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. శ్రీనివాస, చంద్రశేఖర్, భాను ప్రకాష్ శెట్టి, దయాకర్ రెడ్డి ఉన్నారు.

రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీదే అధికారం



బీజేపీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

వనపర్తి అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నారాయణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 19వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు పుష్పక్ యాదవ్‌తో పాటు ఆ వార్డు మాజీ అధ్యక్షుడు బాలరాజు సాగర్, పలువురు నారాయణ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో పుష్పక్ యాదవ్ క్రియాశీలకంగా పని చేసే కుటుంబ వారసత్వ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరినట్లు తెలిపారు. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం రాష్ట్రంలో బీజేపీ అని ప్రజలు విశ్వాసంతో ఉన్నారని తెలిపారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం, రామన్ గౌడ్, సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్తారి ప్రభాకర్, రాజశేఖర్ గౌడ్, శ్రీనివాస్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని కవర్లపై ఆరబెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

పెద్దమందడి, మార్చి 28, (ఆంధ్రజ్యోతి) : యాసంగి వరి పంట ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో నేలపై వరి ధాన్యాన్ని పోయకుండా కవర్లపై ఆరబెట్టాలని సింగిల్‌విండో అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సింగిల్‌విండో కార్యాలయంలో నిర్వహించిన వార్షిక సమావేశంలో మాట్లాడారు. సొసైటీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో నేలపై పోయకుండా కవర్లపై పోసుకోవాలన్నారు. రైతులకు బోనస్ డబ్బులు త్వరలోనే అందజేస్తామన్నారు. సింగిల్‌విండో బ్యాంకు తక్కువ వడ్డీతో రైతులకు రుణాలు అందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో సీఈవో జగదీశ్వర్‌రెడ్డి, రాజ్యప్రకాష్‌రెడ్డి, విట్టా శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి సురేష్, వెంకటేశ్వర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ఎండీ జబ్బార్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం రైతులపై పెట్టిన కేసులను తక్షణమే ఎత్తివేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎండీ జబ్బార్ డిమాండ్ చేశారు. రైతులపై పోలీసుల అణిచివేత చర్య సరైనది కాదని పేర్కొన్నారు. పంజాబ్‌లో రైతుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ.. శుక్రవారం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరించడం తగదన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి, పరమేశ్వరచారి, బాలస్వామి, వెంకటయ్య, నాగయ్య, కృష్ణయ్య, తిరుపతి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

రుణాలు చెల్లించి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీకాంత్‌రెడ్డి

ఆత్మకూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : రేచింతల సహకార సంఘం నుంచి రైతులు పొందిన రుణాలను సకాలంలో చెల్లించి సహకార పరపతి సంఘానికి రైతులు సహకరించాలని రేచింతల సహకార సంఘం అధ్యక్షుడు లక్ష్మీకాంత్ రెడ్డి అన్నారు. మహాజన సభ సమావేశంలో భాగంగా వీర రాఘవపూర్‌లో శుక్రవారం రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సహకార సంఘంలో 1,329 మంది రైతులు సభ్యులుగా ఉన్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న ఎరువులు, విత్తనాలు సకాలంలో రైతులకు అందజేసేలా కృషి చేస్తున్నామని తెలిపారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తేనే తిరిగి రుణం పొందేందుకు అవకాశం ఉంటుందని గుర్తు చేశారు. లోకేష్ కుమార్, రవికుమార్, కొండన్న, నాగన్న, తిరుపతన్న, కురుమన్న, హనుమంత్, బాలయ్య, దేవేంద్రం పాల్గొన్నారు.

శాంతి, సోదరభావాన్ని పెంపొందించాలి



మాట్లాడుతున్న అహ్మద్ హుస్సేన్

అమరచింత, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : అల్లా మార్గంలో నడిచి మహమ్మద్ ప్రవక్త చూపిన సద్గుణను ప్రతీ ఒక్కరు ఆచరించి శాంతి, సోదరభావాన్ని పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నారాయణపేట జిల్లా కొల్లంపల్లి దర్గా పీఠాధిపతి డాక్టర్ అహ్మద్ హుస్సేన్ నక్షబంది పేర్కొన్నారు. అమరచింత జామియా మసీద్‌లో శుక్రవారం తెల్లవారుజాము వరకు నిర్వహించిన షబే ఖా దర్ (జాగరం)లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ ఒక్కరు ప్రవక్త చూపిన ఆదర్శ మార్గాలను ఆచరిస్తు ఐదు పూటల నమాజ్, హజ్ యాత్ర, దానధర్మాలు, పరోపకారం లాంటి సద్గుణ పనులను చేయాలని సూచించారు. రంజాన్ నెలలో సేవలందించిన పలువురికి మసీద్ కమిటీ సభ్యులు సన్మానించి నగదును అందజేశారు. ఆలిమ్ అల్తాఫ్ బేగ్, అయుబ్ ఖాన్, ఫరీద్, అన్వార్, తౌఫిక్, పాషా, ఖాసీం, అస్సు, నిసార్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలుస్తాం

ఆత్మకూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలుస్తామని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఆత్మకూరు మండల పరిధిలోని రేచింతలలో సీనియర్ కార్యకర్త కొల్లంపల్లి మనవరాలు మృతి చెందడంతో కొల్లంపల్లిని కలిసి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే ఇటీవల కాలంలో ప్రమాదవశాత్తు బైక్ ప్రమాదానికి గురైన పిన్నంచర్ల గ్రామ కాంగ్రెస్ కార్యకర్త సత్యంను కలుసుకుని ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్యకర్తల కుటుంబానికి ఎల్లప్పుడు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని తెలిపారు. పరమేష్, శ్రీనివాసులు, రహమతుల్లా, రాజ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పది పరీక్షలు

ఖిల్లాఘణపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం భౌతిక శాస్త్రం పరీక్ష ప్రశాంతంగా కొనసాగింది. విద్యార్థులను పరీక్ష కేంద్రాల నిర్వాహకులు తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. మండలంలో మొత్తం 443 మంది విద్యార్థులకు గాను 441 మంది విద్యార్థులు హాజరై మరో ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో జయశంకర్ తెలిపారు. విద్యార్థులకు తాగునీటి వసతి, పరీక్ష కేంద్రంలో వెలుతురు గాలి ఉండేలా, పరీక్ష రాయడానికి అనుకూలంగా ఫర్నీచర్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఎస్ఐ సురేష్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు పరీక్ష కేంద్రం పరిసరాల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు.

జిల్లా జడ్జిని కలిసిన నూతన కమిటీ సభ్యులు



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

వనపర్తి లీగల్ కంట్రీబ్యూటర్ మార్చి 28, (ఆంధ్రజ్యోతి) : జిల్లా కోర్టులో నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు శుక్రవారం జిల్లా జడ్జి ఎం.ఆర్ సునీత, సీనియర్ సివిల్ జడ్జి రజినిని మర్యాదపూర్వకంగా కలిశారు. కోర్టులో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు కృషి చేస్తామని, సిబ్బందితో కమిటీ సభ్యులు చెప్పారు. అనంతనం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి రవికుమార్, వివిధ కోర్టుల సూపరింటెండెంట్లను కలిశారు. కలిసిన వారిలో నూతన అధ్యక్షుడు డి.కిరణ్‌కుమార్, జనరల్ సెక్రెటరీ వెంకటరమణ, రాందూళి, రాజు, కళ్యాణి తదితరులు ఉన్నారు.

వనపర్తి టౌన్ : బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కిరణ్‌కుమార్‌ను కాంగ్రెస్ నాయకులు శాలువాతో సన్మానించి స్వీట్లు తినిపించారు. దివాకర్ యాదవ్, రోహిత్, దిలీప్, నరసింహ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

హైవేపై భారీ వాహనం



పాలెం సమీపంలో జాతీయ రహదారిపై ఇలా..

కొత్తకోట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాలెం గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై భారీ వాహనం ముందుకు వెళ్లలేక నిలిచి పోయింది. హైదరాబాద్ వైపు నుంచి బెంగళూరుకు ఫ్యాక్టరీకి సంబంధించిన యంత్ర సామగ్రిని ట్రక్కుపై తరలిస్తుండగా.. పాలెం వద్ద రహదారిపై హెచ్చరిక సిగ్నల్ బోర్డు అడ్డు తగిలింది. వాహనం వెంట ఉన్న ఫాక్టరీ అధికారులు ఎల్అండ్‌టీ అధికారులతో మాట్లాడి సిగ్నల్ బోర్డు ఇనుప పైపులను కొంత మేరకు వంపగా.. భారీ వాహనం అక్కడి నుంచి ముందుకు సాగింది.